క్లుప్తంగా

దహన సంస్కార భవనం శ్లాబు నిర్మాణం పూర్తి



మంగళగిరి: నగర పరిధిలోని యర్రబాలెం హిందూ శ్మశానవాటికలో దహన సంస్కారాల భవనం నిర్మాణ పనులు తుది దశకు చేరాయి. గురువారం భవనానికి శ్లాబు పనులు పూర్తి చేయడంతో గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు. శ్మశానవాటిక అభివృద్ధికి ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి (ఆర్కే) చొరవతో అధికారులు రూ.28లక్షలు కేటాయించగా ఇప్పటికే గ్రావెల్ ఫిల్లింగ్, ప్రహరీ నిర్మాణ పనులు పూర్తి చేశారు. గురువారం దహన సంస్కార భవన నిర్మాణ పనులు చివరిదశకు చేరాయి. త్వరలోనే శ్మశానవాటికలో అంతర్గత సీసీ రోడ్లు, విద్యుత్ సౌకర్యంతోపాటు మొక్కలు నాటి పార్కు తరహాలో అభివృద్ధి పర్చనున్నట్లు అధికారులు తెలిపారు.

మహిళ అదృశ్యంపై కేసు నమోదు

ఫిరంగిపురం: ఫిరంగిపురం రసూల్‌పేటకు చెందిన ఓ మహిళ అదృశ్యమైంది. పోలీసులు తెలిపిన వివరాలు... రసూల్‌పేటకు చెందిన ఆరే కృష్ణకుమారి ఈనెల 1న రేపూడిలోని తన అన్నయ్య వద్దకు అని వెళ్లి తిరిగిరాలేదు. ఎక్కడా వెతికినా కన్పించకపోవడంతో కుమారుడు దీపక్‌రెడ్డి గురువారం పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ ఎం.లక్ష్మీనారాయణరెడ్డి తెలిపారు. కృష్ణకుమారి ఐదు అడుగుల ఎత్తుఉండి ఎరుపురంగు కలిగి ఉంటుందని ఆచూకీ తెలిపిన వారు ఫిరంగిపురం పోలీసుస్టేషన్‌లో(సెల్ నంబరు.. 9440900876) తెలియజేయాలని కోరారు.

120 మందికి కంటి పరీక్షలు

ఫిరంగిపురం: మండలంలోని అమీనాబాద్ లూథరన్ చర్చి వద్ద గురువారం ఎల్‌వీ ప్రసాద్ కంటి వైద్యశాల ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. శిబిరాన్ని పంచాయతీ అభివృద్ధి కమిటీ చైర్మన్ కె.ఆనంద్ ప్రారంభించి మాట్లాడారు. ఇటువంటి శిబిరాలను ప్రజలు వినియోగించుకోవాలని కోరారు. అనంతరం 120మందికి వైద్యులు కంటి పరీక్షలు చేశారు. కంటిశుక్లాలు ఉన్నవారికి వైద్యశాలలో ఉచితంగా ఆపరేషన్లు నిర్వహిస్తామని తెలిపారు. కార్యక్రమంలో చిట్టా బాపూజీరెడ్డి, ఐజాక్, రత్నరాజు, పి.చిన్న పాల్గొన్నారు.

ఉద్యోగోన్నతులు కల్పించాలని వినతి



మంగళగిరి: నగర పాలక సంస్థ కార్యాలయంలో విధులు నిర్వహిస్తున్న పలువురు ఉద్యోగులకు ఉద్యోగోన్నతులు కల్పించాలని ఏపీ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం నాయకులు కోరారు. కమిషనర్ శారదాదేవిని గురువారం ఆమె చాంబర్‌లో కలసి వినతిపత్రం అందజేశారు. ఏపీ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం ప్రతినిధులు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు మురళి, ఉపాధ్యక్షులు మహేష్‌కుమార్, పల్నాడు జిల్లా అధ్యక్ష,కార్యదర్శులు ఎస్ చిన్నరామిరెడ్డి, ఎస్ రవి తదితరులు పాల్గొన్నారు.

ఆరు నుంచి సముద్రపు ఆహార మహోత్సవం

తాడేపల్లిరూరల్: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం, భూమి ఆర్గానిక్ సంయుక్తంగా ఐదో ఆర్గానిక్ మహోత్సవాన్ని ఈనెల 6,7,8 తేదీల్లో విజయవాడలోని ఎస్ఎస్ కన్వెన్షన్ సెంటర్‌లో నిర్వహిస్తున్నట్లు భూమి ఆర్గానిక్ సంస్థ ఎండీ రఘురాం తెలిపారు. వడ్డేశ్వరంలోని కేఎల్ విశ్వవిద్యాలయంలో సముద్రపు ఆహార మహోత్సవ వాల్‌పోస్టర్‌ను భూమి ఆర్గానిక్ సంస్థ ఎండీ మాగులూరి రఘురాం , విశ్వవిద్యాలయ సీఈఓ అలోక్ గోవిల్‌తో కలసి గురువారం ఆవిష్కరించారు. రఘురాం మాట్లాడుతూ దక్షిణ భారతదేశపు అతిపెద్ద సముద్రపు ఆహార పండుగను నిర్వహిస్తున్నామని, రకరకాల సముద్రపు చేపలు, వాటి వంకాలతో నోరూరించే అద్భుత రుచులతో సముద్రపు ఆహార మహోత్సవాన్ని నిర్వహిస్తున్నామని అన్నారు. ప్రజలందరూ పాల్గొని ఈ రుచులను ఆస్వాదించాలని కోరారు.

అభ్యంతరాలుంటే తెలియజేయండి

ఓటర్ల జాబితాను ప్రదర్శించిన రెవెన్యూ అధికారులు

తాడికొండ: ఓటరు జాబితాలో అభ్యంతరాలుంటే వెంటనే సంబంధిత గ్రామ వీఆర్వోకు ఫిర్యాదు చేయాలని తహసీల్దార్ ఫణీంద్ర బాబు సూచించారు. తుళ్లూరులో మరణించిన వారి పేర్లు జాబితా నుంచి తొలగింపు, నూతనంగా ఓటరు నమోదు చేసుకున్న, సవరణకు దరఖాస్తు చేసుకున్న వారి జాబితాను తుళ్లూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రదర్శించడంతో పాటు అన్ని సచివాలయాల్లో అందుబాటులో ఉంచడం జరిగిందన్నారు. విచారణలో ఎవరి ప్రమేయం లేకుండా నేరుగా రెవెన్యూ అధికారులే ఇంటింటికి తిరిగి పక్కాగా నమోదు చేశారని, కనుక ఆ జాబితాను పరిశీలించుకొని అభ్యంతరాలు ఉంటే వెంటనే ఫిర్యాదు చేస్తే సవరిస్తామని తహసీల్దార్ తెలిపారు.

ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం

నూతన పెన్షన్లు అందజేసిన ఎమ్మెల్సీ మురుగుడు, ఎమ్మెల్యే ఆర్కే



ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న ఎమ్మెల్సీ మురుగుడు, ఎమ్మెల్యే ఆర్కే, లబ్ధిదారులు

తాడేపల్లిరూరల్ (దుగ్గిరాల): దుగ్గిరాల మండల అభివృద్ధి కార్యాలయంలో గురువారం నూతనంగా మంజూరైన పెన్షన్ల లబ్ధిదారులు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం నిర్వహించారు. ముఖ్య అతిథులుగా హాజరైన ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు, ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి (ఆర్కే)లు ఎంపీపీ దానబోయిన సంతోష రూపవాణి, జెడ్పీటీసీ సభ్యురాలు మేకతోటి అరుణతో కలసి నూతన పెన్షన్లు లబ్ధిదారులకు అందజేశారు. ఎమ్మెల్యే ఆర్కే మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాదయాత్ర సమయంలో వృద్ధులు, వికలాంగులు పడుతున్న ఇబ్బందులను గుర్తించి రాష్ట్ర వ్యాప్తంగా 64 లక్షల మందికి 13 రకాల పెన్షన్లు అందజేస్తున్నారని అన్నారు. రాజకీయ ఒత్తిళ్లు, లంచాలకు తావులేకుండా అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వం సంక్షేమ పథకాలతోపాటు సామాజిక పెన్షన్లు కూడా అందజేస్తున్నట్లు తెలిపారు. మంగళగిరి నియోజకవర్గ వ్యాప్తంగా 40 వేల మందికి పెన్షన్లు పంపిణీ చేస్తున్నామని తెలిపారు. పేద, మధ్య తరగతి ప్రజల్లో వృద్ధులైన వారిని చూసుకోవడానికి ఆర్థిక ఇబ్బందులు పడుతున్నారని, పిల్లలు లేని వృద్ధులకు మందులు కొనుగోలు చేయడానికి కూడా ఇబ్బందులు పడుతున్నారని గమనించి, పాదయాత్రలో నేను ఉన్నానని మాట ఇచ్చారని, ఆ మాట ప్రకారం 1వ తేదీన వలంటీర్లు ప్రతి లబ్ధిదారుడి ఇంటికి వెళ్లి పెన్షన్లు అందజేస్తున్నారని స్పష్టం చేశారు. ఇంతకు ముందు పెన్షన్లు తీసుకోవాలంటే అధికారుల వద్దకు, రాజకీయ నాయకుల వద్దకు తిరిగి ఇబ్బంది పడేవారని ఆ వ్యవస్థను ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పూర్తిగా తొలగించి ప్రతి గ్రామంలోనూ సచివాలయాలు ఏర్పాటు చేసి వలంటీర్లే మీ ఇంటి వద్దకు వచ్చి సంక్షేమ పథకాలు అందజేస్తున్నారని అన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ మల్లేశ్వరి, ఎంపీడీఓ కుసుమశ్రీదేవి, మార్కెట్ యార్డ్ చైర్మన్ షేక్ బాజి, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, వైఎస్సార్ సీపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

మూడున్నరేళ్లలో రూ.1400 కోట్ల అభివృద్ధి

- ఎమ్మెల్యే డాక్టర్ ఉండవల్లి శ్రీదేవి
- రానున్న రోజుల్లో మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలు చేపడతాం
- అధికారుల సహకారం వల్లే ఇదంతా సాధ్యం



అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే డాక్టర్ ఉండవల్లి శ్రీదేవి

తాడికొండ: మూడున్నరేళ్లలో తాడికొండ నియోజకవర్గంలో రూ.1400 కోట్లతో అభివృద్ధి చేశామని, అధికారుల సహకారంతోనే ఇదంతా సాధ్యమైందని తాడికొండ ఎమ్మెల్యే డాక్టర్ ఉండవల్లి శ్రీదేవి అన్నారు. గురువారం గుంటూరులోని తన కార్యాలయంలో అన్ని ప్రభుత్వ శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించిన ఆమె మాట్లాడుతూ తాడికొండ నియోజకవర్గంలో పేదలకు ఏకంగా 17,050 మందికి ఇళ్ల పట్టాలు అందించడం జరిగిందన్నారు. నియోజకవర్గంలోని రైతులకు ఏడాదికి రూ.13,500 చొప్పున రూ.140.36 కోట్లు పంపిణీ చేశామన్నారు. అమ్మ ఒడి పథకం కింద ఏడాదికి రూ.15 చొప్పున 27,492 మంది లబ్ధిదారులకు రూ.41.23 కోట్లు, వికలాంగ పింఛన్లు రూ.890.03 కోట్లు, సున్నా వడ్డీకే రుణాలు, కాపు నేస్తం, వాహన మిత్ర, జగనన్న చేదోడు పథకం ద్వారా రూ.121.36 కోట్లు పంపిణీ చేసినట్లు తెలిపారు. నాడు–నేడు పథకంలో భాగంగా పాఠశాలల అభివృద్ధికి రూ.11 కోట్లు, వైఎస్సార్ సంపూర్ణ పోషణ, జగనన్న విద్యా దీవెన, జగనన్న వసతి దీవెన ద్వారా ప్రతి విద్యార్థి భవిష్యత్తుకు ప్రభుత్వం అందించే పథకాలతో బాటలు వేయడం జరిగిందన్నారు. అధికారుల సమష్టి కృషితోనే ఇదంతా సాధ్యమైందని, తనను గెలిపించిన ప్రజల సమస్యల పరిష్కారం కోసం చిత్తశుద్ధితో పనిచేసి అన్ని రకాలుగా అందుబాటులో ఉంటానని తెలిపారు. ప్రతిపక్షాలు ఎన్ని కుట్రలు చేసినా 2024లో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి కావడం ఖాయమన్నారు. కార్యక్రమంలో పలు ప్రభుత్వ శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

బాలల పరిరక్షణపై అవగాహన

తాడేపల్లిరూరల్: తాడేపల్లి రూరల్‌ప్రాంతంలోని నులకపేటలోని మారుతీ మహిళా సొసైటీ సభ్యులకు బాలల పరిరక్షణపై గురువారం నవజీవన్ బాలభవన్ ప్రోగ్రాం మేనేజర్ గోళ్లమూడి శేఖర్ బాబు అవగాహనా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆపదలో వున్న బాలలను పరిరక్షించాలని, వారికి రక్షణగా ఉండాలని అన్నారు. బాలలను తిట్టడం, కొట్టడం, మానసికంగా వేధించడం చేయకూడదని, అలా చేస్తే వారు మానసికంగా కుంగుబాటుకు గురవుతారని వివరించారు. బాలల పట్ల లైంగిక వేధింపులు లాంటి సంఘటనలు జరగకుండా చూడాలని, అలాంటి సంఘటనలు మీకు తెలిసినా, చూసినా పోలీసులకు వెంటనే తెలియజేయాలని కోరారు. బాలలు, యువత ముందు సిగరెట్, మందు, గంజాయి మొదలైన మత్తు పదార్థాలను సేవించరాదని అన్నారు. మత్తు పదార్థాలకు బానిసైన వారిని బయటకు తీసుకు రావడానికి డీ ఎడిక్షన్ చికిత్స అందుబాటులో ఉందని, మీకు ఎవరైనా అలాంటివారు ఎదురైతే 9490492020కు సమాచారం అందించాలని అన్నారు. కార్యక్రమంలో నవజీవన్ బాలభవన్ జోనల్ కో ఆర్డినేటర్ బి.రమేష్, మారుతీ మహిళా సొసైటీ ప్రాజెక్ట్ మేనేజర్ బి.గిరిజ తదితరులు పాల్గొన్నారు.

ప్రాంగణ ఎంపికలో చలపతి విద్యార్థుల ప్రతిభ



ఎంపికైన విద్యార్థులతో కళాశాల యాజమాన్యం, కంపెనీ ప్రతినిధులు

మోతడక(తాడికొండ): బిట్ ల్యాబ్స్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ నిర్వహించిన ప్రాంగణ ఎంపికలలో తమ కళాశాలకు 25 మంది విద్యార్థులు ఎంపికయ్యారని మోతడక చలపతి ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ వి రంగారావు తెలిపారు. ఆయన మాట్లాడుతూ కళాశాలలో ఆఖరి సంవత్సరం చదువుతున్న విద్యార్థులకు ఆప్టిట్యూడ్, టెక్నికల్, ముఖాముఖి ఇంటర్వ్యూల ద్వారా గురువారం ప్రాంగణ ఎంపికలు నిర్వహించగా అత్యుత్తమ ప్రతిభ కనబరచిన విద్యార్థులను ఉద్యోగాలకు ఎంపిక చేయడం జరిగిందన్నారు. ఎంపికైన విద్యార్థులకు వార్షిక వేతనం రూ.3.50 లక్షలు ఉంటుందని తెలిపారు. కళాశాలల ప్రణాళిక ప్రకారం ఉపాధి శిక్షణ, వ్యక్తిత్వ తరగతులు నిర్వహించి విద్యార్థులలో అవగాహన పెంపొందించడం ద్వారా ఉద్యోగాలకు ఎంపికలలో సులువుగా అర్హత సాధిస్తున్నారన్నారు. ఎంపికైన విద్యార్థులను ప్రిన్సిపల్‌తోపాటు కళాశాల చైర్మన్ వైవీ ఆంజనేయులు, కార్యదర్శి వైవీ సుజిత్ కుమార్, వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ నాగ శ్రీనివాస రావు అభినందించారు. కార్యక్రమంలో ఉపాధి కల్పనాధికారి ఎ శ్రీనివాస్, వివిధ విభాగాధిపతులు, కో ఆర్డినేటర్‌లు పాల్గొన్నారు.

అవయవదానంపై అవగాహన



అవయవదానంపై అవగాహన కల్పిస్తున్న కేఎల్‌యూ విద్యార్థులు

తాడేపల్లిరూరల్: నూతక్కి గ్రామంలో అవయవదానంపై కేఎల్‌యూ విద్యార్థులు గురువారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. గ్రామంలో ఇంటింటికి వెళ్లి అవయవదానంపై అవగాహన కల్పించారు. డీన్ డాక్టర్ సీహెచ్ హనుమంతరావు మాట్లాడుతూ మానవ శరీరంలోని అవయవాలు ఎంతో ప్రాముఖ్యమైనవని అన్నారు. సమాజంలో ఎంతోమందికి అవయవ లోపాలు ఉన్నాయని, చనిపోయిన వారి అవయవాలను దానం చేస్తే ఆ లోటును భర్తీ చేయవచ్చని అన్నారు. కార్యక్రమంలో సాయి విజయ్, సాక్ అసోసియేట్ డీన్ డాక్టర్ కె.రూతు రమ్య పాల్గొన్నారు. అవయవదానంపై అవగాహన కల్పించినందుకు విశ్వవిద్యాలయ వైస్ చాన్సలర్ డాక్టర్ జి.పార్థసారథివర్మ, వైస్ చాన్సలర్ డాక్టర్ ఎస్.వెంకట్రామ్, రిజిస్ట్రార్ డాక్టర్ ఎ.జగదీష్‌లు వారిని అభినందించారు.

లిఫ్ట్ ఇరిగేషన్ పైపులను అక్రమంగా తరలిస్తున్న ట్రాక్టరు స్వాధీనం



పోలీసులు స్వాధీనం చేసుకున్న ట్రాక్టరు

తాడికొండ: లిఫ్ట్ ఇరిగేషన్ పైపులను అక్రమంగా తరలిస్తున్న ట్రాక్టరును స్వాధీనం చేసుకొని డ్రైవర్‌ను అదుపులోకి తీసుకున్నట్లు తుళ్లూరు సీఐ ఆనందరావు తెలిపారు. వివరాల ప్రకారం.. అమరావతి మండలం మండెపూడి గ్రామానికి చెందిన మందడపు శ్రీనివాసరావు తన ట్రాక్టర్‌లో తుళ్లూరు మండలం అబ్బరాజుపాలెం గ్రామ శివారులో లిఫ్ట్ ఇరిగేషన్ కోసం వేసిన మూడు సిమెంట్ పైపులను దొంగతనంగా ట్రాక్టరులో తరలిస్తున్నాడు. అబ్బరాజుపాలెం గ్రామ వీఆర్వో ఫిర్యాదు మేరకు ఎస్‌ఐ సోమేశ్వరరావు తమ సిబ్బంది సాయంతో ఘటనా స్థలానికి చేరుకొని ట్రాక్టరును సీజ్ చేసి నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు. ట్రాక్టర్ డ్రైవర్ తన బావమరిది జొన్నలగడ్డ రమేష్ సాయంతో దొండపాడు గ్రామానికి చెందిన సీతారామయ్య డ్రైవర్ మీరాకి చెందిన జేసీబీతో పైపులను ట్రాక్టరులో వేసి తరలిస్తున్నట్లు తమ విచారణలో వెల్లడైందన్నారు. మూడు సిమెంటు పైపుల విలువ రూ.15 వేల వరకు ఉంటుందని, ఈ కేసులో జేసీబీని సీజ్ చేయడంతోపాటు మరో నిందితుడిని అరెస్టు చేయాల్సి ఉందని సీఐ తెలిపారు.

సంక్రాంతి సందర్భంగా విద్యార్థులకు క్రీడా పోటీలు: మేయర్ కావటి

నెహ్రూనగర్: గుంటూరు నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో సంక్రాంతి సంబరాల్లో భాగంగా విద్యార్థులకు క్రీడా పోటీలు నిర్వహించనున్నట్లు గుంటూరు నగర పాలక సంస్థ మేయర్ కావటి శివనాగమనోహర్ నాయుడు తెలిపారు. సంక్రాంతి సంబరాల నిర్వహణపై నగరపాలక సంస్థ పాఠశాలల పీఈటీలు, ప్రైవేట్ పాఠశాలల ప్రతినిధులు, యన్‌టీఆర్ స్టేడియంలోని వివిధ విభాగాల కోచ్‌లతో గురువారం తన చాంబర్‌లో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ జనవరి 9వ తేదీ సాయంత్రం నాటికి పోటీల్లో పాల్గొనే విద్యార్థుల వివరాలు సేకరించాలని తెలిపారు. 11, 12 తేదీల్లో పోటీలు నిర్వహించి, 16న క్రీడల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు పంపిణీ చేయాలని చెప్పారు. అధికారులు, పీఈటీలు బృందాలుగా ఏర్పడి క్రీడల నిర్వహణకు ఏర్పాట్లు చేయాలని మేయర్ తెలిపారు.

పక్షులను సంరక్షించాలి

పక్షులను కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని నగర మేయర్ కావటి శివనాగ మనోహర్‌నాయుడు తెలిపారు. జవరి 5న నేషనల్ బర్డ్ డే సందర్భంగా ఆంధ్రప్రదేశ్ పర్యావరణ విద్యా పరిషత్ ఆధ్వర్యంలో తన చాంబర్‌లో బ్రోచర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ పర్యావరణ పరిరక్షణకు నడుం కట్టి పక్షి, జంతు జాతుల సంరక్షణకు కృషి చేయాలని పిలుపునిచ్చారు.

భావనారుషిస్వామి కల్యాణ మహోత్సవ ఆహ్వానపత్రిక ఆవిష్కరణ



ఆహ్వానపత్రికలను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి (ఆర్కే)

మంగళగిరి: పాత మంగళగిరిలోని శ్రీ పద్మశాలీయ బహూత్తమ సేవా సంఘం కల్యాణ మండపంలో వేంచేసియున్న శ్రీ భద్రావతీ సమేత భావనారుషి స్వామి వార్ల కల్యాణ మహోత్సవ ఆహ్వానపత్రికలను, నూతన సంవత్సర క్యాలెండర్లను ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి (ఆర్కే) ఆవిష్కరించారు. భావనారుషి స్వామి వారికి ఎమ్మెల్యే ఆర్కే ప్రత్యేక పూజలు నిర్వహించారు. కల్యాణ మండపంలో గురువారం జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే ఆర్కే మాట్లాడుతూ అనేక సంవత్సరాలుగా భావనారుషి స్వామివార్ల కల్యాణ మహోత్సవాన్ని వైభవంగా నిర్వహిస్తుండటం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో ఆప్కో చైర్మన్ చిల్లపల్లి మోహన రావు, మార్కెట్ యార్డు చైర్‌పర్సన్ మునగాల భాగ్యలక్ష్మి, పార్టీ రాష్ట్ర చేనేత విభాగం అధ్యక్షుడు గంజి చిరంజీవి, పార్టీ పట్టణ కన్వీనర్ మునగాల మల్లేశ్వరరావు, పద్మశాలీయ బహూత్తమ సంఘ ప్రతినిధులు పాల్గొన్నారు.

కుటుంబ కలహాలతో వ్యక్తి ఆత్మహత్య

గుంటూరు రూరల్: కుటుంబ కలహాలతో మద్యానికి బానిసైన వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన గురువారం నల్లపాడు పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. సీఐ శ్రీనివాసరావు తెలిపిన వివరాల ప్రకారం.. స్వర్ణభారతీనగర్‌కు చెందిన గ్యారా ప్రేమ్‌కుమార్ అలియాస్ చంటి (37) పెయింటర్‌గా జీవిస్తుంటాడు. ఈ క్రమంలో మద్యానికి బానిసయ్యాడు. దీంతో కుటుంబంలో కలహాలు ఏర్పడటంతో గురువారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యానుకు ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కుటుంబ సభ్యులు గమనించి పోలీసులకు తెలపగా మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జీజీహెచ్‌కు తరలించారు. మృతుని తండ్రి ప్రకాశరావు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.

రౌడీషీటర్లు, అనుమానిత వ్యక్తుల కదలికలపై నిఘా

జిల్లా ఎస్పీ ఆరిఫ్ హఫీజ్

నగరంపాలెం: రౌడీషీటర్లు, అనుమానితుల వ్యవహారశైలి, కదలికలపై ఎప్పటికప్పుడు నిఘా ఉండాలని జిల్లా ఎస్పీ కె.ఆరిఫ్ హఫీజ్ ఆదేశించారు. పశ్చిమ సబ్ డివిజన్‌లోని పట్టాభిపురం పోలీస్‌స్టేషన్ (పీఎస్)ను గురువారం రాత్రి ఆయన తనిఖీ చేశారు. పెండింగ్, ముఖ్యమైన కేసుల వివరాలు, లాకప్, కంప్యూటర్ గది, పరిసరాల్ని పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ ప్రాపర్టీ, మిస్సింగ్, ముఖ్యమైన కేసుల్ని త్వరితగతిన దర్యాప్తు పూర్తి చేయాలని తెలిపారు. గొలుసు దొంగతనాలు జరగకుండా పరిసర ప్రాంతాల్లో నిఘా ఉండాలని చెప్పారు. రాత్రుళ్లు విధులు నిర్వర్తించేటప్పుడు తప్పనిసరిగా వేలిముద్రల యంత్రాన్ని ఉపయోగించాలని ఆదేశించారు. శాంతిభద్రతలను కాపాడేందుకు సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని సూచించారు. పాఠశాలలు, కళాశాలలు ప్రారంభ వేళలు, సాయంత్ర వేళల్లో గస్తీ నిర్వర్తించాలని తెలిపారు. కార్యక్రమంలో స్టేషన్ సీఐ రాజశేఖర్ రెడ్డి, ఎస్‌బీ సీఐ బి.నరసింహ, ఎస్ఐలు విజయ్‌కుమార్, హనుమంతరావు, సీసీ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

జగనన్న పథకాలు దేశానికే ఆదర్శం

● తాడికొండ ఎమ్మెల్యే డాక్టర్ ఉండవల్లి శ్రీదేవి ● పెరిగిన, నూతన పెన్షన్లు అందజేత

ఫిరంగిపురం: జగనన్న పథకాలు దేశానికే ఆదర్శంగా నిలిచాయని తాడికొండ ఎమ్మెల్యే ఉండవల్లి శ్రీదేవి అన్నారు. స్థానిక సెయింట్‌పాల్స్ ఆడిటోరియంలో గురువారం నూతన పింఛన్లు, పెంచిన పింఛన్ల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. శ్రీదేవి మాట్లాడుతూ గత టీడీపీ ప్రభుత్వ హయాంలో పింఛన్ కావాలంటే మధ్యవర్తుల ప్రమేయం ఉండేదని చెప్పారు. వైఎస్సార్ కాంగ్రెస్‌పార్టీ ఆధ్వర్యంలో ఏర్పడిన ప్రభుత్వంలో అటువంటి పరిస్థితి లేకుండా అర్హులైన ప్రతి ఒక్కరికీ పింఛన్లు మంజూరు చేస్తోందన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తన పాదయాత్రలో ఇచ్చిన హామీల్లో భాగంగా పింఛన్ల పెంపుదలను చేసి మాటతిప్పని మడమ తిప్పని నేతగా నిలిచారని చెప్పారు. సీఎం అందిస్తున్న సంక్షేమ పథకాలతో ప్రజలు సుఖశాంతులతో ఉన్నారని దేశంలోనే ప్రజల పక్షాన నిలిచి సంక్షేమాభివృద్ధి చేసిన నేతగా గుర్తింపు పొందారని తెలిపారు. ప్రతి నెలా ఒకటో తేదీనే లబ్ధిదారుల ఇంటివద్దకే వలంటీరు వెళ్లి పింఛన్ నగదు అందజేస్తున్నట్లు చెప్పారు. సంక్షేమం అభివృద్ధి రెండు కళ్లుగా ప్రభుత్వం పేదల పాలిట నిలుస్తుందన్నారు. ప్రతి గ్రామంలో నాడు–నేడు కింద ప్రభుత్వ పాఠశాలలు అభివృద్ధి చేశారని చెప్పారు. అనంతరం 290 మంది లబ్ధిదారులకు పింఛన్లు అందజేశారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యురాలు డి.కత్తిరేణమ్మ, మార్పుల శివరామిరెడ్డి, షేక్ అబ్దుల్ గఫార్, కె.చిన్నప్పరెడ్డి, చిట్టా అంజిరెడ్డి, పి.జేమ్స్‌ఐన్నయ్య, పాలపాటి రఘు, బద్దూరి శ్రీనివాసరెడ్డి, మేడా బాబు, డి.మెల్కియా, గుమ్మడి చంద్రం, సాలె సంధ్యారాణి, పి.నాగమల్లేశ్వరి, ఎం.సుధాకరరెడ్డి, వి.పిచ్చిరెడ్డి, యల్లారెడ్డి, కె.వీరయ్య, జాకీర్, ఎంపీడీవో డి.అనూరాధ, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.



లబ్ధిదారులకు పింఛన్ సొమ్ము అందజేస్తున్న ఎమ్మెల్యే ఉండవల్లి శ్రీదేవి

ఎస్ఆర్ఎం ప్రత్యేక అవగాహన సెంటర్‌కు ఆదరణ

ఇండియన్ సైన్స్ కాంగ్రెస్‌లో ఏర్పాటు



ఇండియన్ సైన్స్ కాంగ్రెస్‌లో పాల్గొన్న ఏపీ ఎస్ఆర్ఎం విద్యార్థులు

మంగళగిరి: మహారాష్ట్రలోని నాగ్‌పూర్ ఆర్టీఎం యూనివర్సిటీలో జరుగుతున్న 108వ ఇండియన్ సైన్స్ కాంగ్రెస్‌కు వివిధ రాష్ట్రాల నుంచి వచ్చే విద్యార్థుల కోసం ఏపీ ఎస్ఆర్ఎం యూనివర్సిటీ ఏర్పాటు చేసిన ప్రత్యేక ప్రచార అవగాహన కేంద్రానికి విశేషమైన ఆదరణ లభిస్తుంది. ఈనెల 3వ తేదీన ప్రధానమంత్రి నరేంద్ర మోదీ దృశ్య మాధ్యమ పద్ధతిలో 108వ ఇండియన్ సైన్స్ కాంగ్రెస్‌ను ప్రారంభించారు. కేంద్రమంత్రి నితిన్ గడ్కరీ, మహారాష్ట్ర గవర్నర్ భగత్‌సింగ్ కొష్యారీ, ముఖ్యమంత్రి ఏక్‌నాథ్ షిండే, ఉప ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్‌లు ముఖ్య అతిథులుగా హాజరైన సైన్స్ కాంగ్రెస్ ప్రారంభ కార్యక్రమానికి వివిధ రాష్ట్రాల నుంచి పెద్ద సంఖ్యలో విద్యార్థులు, శాస్త్రవేత్తలు, పరిశోధనారంగ నిపుణులు తరలివచ్చారు. డీఆర్‌డీఓ, సీఎస్ఐఆర్, ఇస్రో వంటి దేశ రక్షణ, పరిశోధనా రంగ సంస్థలతోపాటు దేశం నలుమూలల నుంచి వచ్చిన పలు విద్యా, వ్యాపార సంస్థలు సైన్స్ కాంగ్రెస్ ప్రాంగణంలో ప్రత్యేక అవగాహన కేంద్రాలను ఏర్పాటు చేశాయి. ఇందులో భాగంగా ఏపీ ఎస్ఆర్ఎం యూనివర్సిటీ బోధన, పరిశోధన లక్ష్యమన్న నినాదంతో ఉన్నత విద్య ప్రాముఖ్యతలను తెలియపరుస్తూ సెంటర్ ఏర్పాటు చేసింది. ఇంజనీరింగ్, లిబరల్ ఆర్ట్స్, స్కూల్ ఆఫ్ బిజినెస్ కోర్సుల్లో ఎస్ఆర్ఎం అందిస్తున్న విద్యావిధానం, ఉద్యోగ, ఉపాధి అవకాశాల గురించి నాగ్‌పూర్ ఏరియా మేనేజర్ అనూప్‌కుమార్ విద్యార్థులకు వివరించారు. ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన ఎల్ఈడీ స్క్రీన్ ద్వారా విద్యార్థుల సందేహాలను నివృత్తి చేస్తున్నారు. నాగ్‌పూర్, గడ్చిరోలి, అమరావతి, విదర్భ, బండారా, పూనే, కోల్హాపూర్, చత్తీస్‌గఢ్ ప్రాంతాల నుంచి వేలామంది విద్యార్థులు సైన్స్ కాంగ్రెస్‌కు హాజరై ఎస్ఆర్ఎం సెంటర్‌ను సందర్శించి కోర్సుల వివరాలను తెలుసుకున్నారు.

మృతుడి కుటుంబానికి ఆర్థిక సాయం



మృతి చెందిన చింతా రాజేష్ కుటుంబాన్ని పరామర్శిస్తున్న ఎమ్మెల్యే ఆర్కే, వైఎస్సార్ సీపీ నాయకులు

తాడేపల్లిరూరల్ (దుగ్గిరాల): దుగ్గిరాల మండలం పెరికలపూడిలో ఇటీవల మృతి చెందిన చింతా రాజేష్ కుటుంబాన్ని ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి గురువారం వైఎస్సార్‌సీపీ నాయకులతో కలసి పరామర్శించారు. రాజేష్ పిల్లలు చదువుకునేందుకు లక్ష రూపాయలు ఆర్థిక సహాయం అందిస్తానని ఎమ్మెల్యే ఆర్కే ప్రకటించారు. అనంతరం అదే గ్రామంలో నాదెండ్ల జష్వంత్ విస్తరాకులు తయారు చేసే యంత్రంలో చేయి పడి చేతివేళ్లు తెగిపోవడంతో ఆ బాలుడి కుటుంబాన్ని పరామర్శించి ఆర్థిక సహాయం అందజేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఎంపీపీ దానబోయిన సంతోష రూపవాణి, జెడ్పీటీసీ సభ్యురాలు మేకతోటి అరుణ, మార్కెట్ యార్డ్ చైర్మన్ ఎస్‌కె బాజి, వైఎస్సార్ సీపీ నాయకులు తాడిబోయిన వెంకటేశ్వరరావు, నూతలపాటి కేశవరావు, మహేష్, చక్రవర్తి తదితరులు పాల్గొన్నారు.

ఓటర్ల జాబితాల ప్రదర్శన



ఓటర్ల జాబితాలతో అడిషనల్ కమిషనర్ హేమమాలిని

మంగళగిరి: నగర పరిధిలోని పోలింగ్ కేంద్రాల్లో ఓటర్ల జాబితాలు ప్రదర్శించినట్లు అసిస్టెంట్ ఎలక్ట్రోరల్ రిజిస్ట్రేషన్ అధికారి, నగరపాలక సంస్థ అదనపు కమిషనర్ హేమమాలిని తెలిపారు. గురువారం నగర పాలక సంస్థ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ఓటర్ల జాబితాలను ప్రదర్శించారు. ఆమె మాట్లాడుతూ నగర పరిధిలోని పోలింగ్ కేంద్రాల్లో ఓటర్ల జాబితాలను ప్రదర్శించడం జరిగిందని, ఓటు హక్కు పొందని వారు అందరూ ఓటు హక్కు పొందేలా నమోదు చేసుకోవాలని కోరారు. ఓటు హక్కు కలిగిన వారు మార్పులు– చేర్పులు ఉంటే సంబంధిత బీఎల్ఓ వద్ద దరఖాస్తు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో టీపీఓ వెంకటేశ్వరరెడ్డితో పాటు పలువురు సిబ్బంది పాల్గొన్నారు.

యర్రబాలెంలో కొండ చిలువ కలకలం



యర్రబాలెంలో స్థానికులు కొట్టి చంపిన కొండ చిలువ

మంగళగిరి: మంగళగిరి–తాడేపల్లి నగరపాలక సంస్థ పరిధిలోని యర్రబాలెంలో కొండ చిలువ కలకలం రేపింది. సుమారు 10 అడుగుల పొడవైన కొండ చిలువ యర్రబాలెం– పెనుమాక రహదారి మార్గంలోని హిందూ శ్మశానవాటిక సమీపంలో దట్టమైన కంపచెట్లలో నుంచి గురువారం రాత్రి అకస్మాత్తుగా రోడ్డుపైకి రావడంతో స్థానికులు భయభ్రాంతులకు గురై పరుగులు తీశారు. రోడ్డుపై నుంచి నివాసాల మధ్యకు వస్తున్న తరుణంలో భయంతో కొండ చిలువను స్థానికులు కొట్టి చంపారు.